

'అభయహస్తం' పేరిట ప్రభుత్వం ఇటీవల స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. గత డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని 499 గ్రామాలు, 5 పట్టణాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తులను వెను వెంటనే కంప్యూటరీకరించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాకు సంబంధించిన 3,25,214 దరఖాస్తులను ఆయా గ్యారంటీల వారీగా ఆన్‌లైన్ చేశారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 19


ప్రజాపాలనలో దరఖాస్తుల సమర్పణ (ఫైల్)

గ్యాస్ ఫస్ట్.. కరెంట్ నెక్స్ట్

- మహాలక్ష్మి, గృహజ్యోతిలకు అత్యధిక దరఖాస్తులు
- ఇల్లు కావాలని 2.36 లక్షల మంది నమోదు
- రూ.2,500 సాయం కోసమూ పోటాపోటీ
- కొత్తగా పింఛన్లకు 88 వేల మంది విన్నపం
- 3.25 లక్షల ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్
- 'గ్యారంటీ'లకు 14.56 లక్షల అర్జీలు

ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.1100 పైచిలుకు ఉంది. దీనిపై సబ్సిడీ ఉన్నప్పటికీ ఎవరి ఖాతాల్లో కూడా సక్రమంగా కేంద్ర ప్రభుత్వం నుంచి జమ కావట్లేదనే అభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తులు సైతం స్వీకరించారు. ఈ దరఖాస్తుల్లో అత్యధికంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వైపే మొగ్గు చూపించారు. 3.25లక్షల దరఖాస్తులు స్వీకరించగా ఇందులో 2.83లక్షల మంది తమకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించాలని కోరారు. అయితే ఒక కుటుంబానికి ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఇస్తారనే విధివిధానాలు రూపొందించిన తర్వాతనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రతీ గ్యారంటీకి పోటాపోటీ

ప్రజాపాలన దరఖాస్తులను జల్లెడ పట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎందుకంటే గ్యారంటీలు, సంక్షేమ పథకాలకు పోటాపోటీగా దరఖాస్తులు సమర్పించారు. 3.25 లక్షల దరఖాస్తుల్లో 2.36లక్షల మంది తమకు సొంత ఇల్లు లేదని నమోదు చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక జిల్లాలో దాదాపు 4.50 లక్షల పైచిలుకు మహిళలు ఉంటారు. వీరిలో అవివాహితులు, వృద్ధ, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగ మహిళలను మినహాయిస్తే ఒక లక్ష మంది అర్హులు మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.2500 పొందే అవకాశాలున్నట్లుగా అంచనా వేశారు. కానీ ఈ పథకానికి 2.50 లక్షల మంది మహిళలు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లాలో 2 లక్షల పైచిలుకు మందికి ఆసరా పింఛన్లు అందుతున్నాయి. ఇవి కాకుండా కొత్తగా చేయూత పథకం ద్వారా పింఛన్లు పొందడానికి మరో 90 వేల మంది దరఖాస్తు చేయడం గమనార్హం. జిల్లాలో 3.35లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా 2.67 లక్షల కుటుంబాల నుంచి తమకు రూ.200 యూనిట్లలోపు విద్యుత్ ఉచితంగా కావాలని దరఖాస్తుల్లో పేర్కొన్నారు.

గ్యారంటీల వారీగా దరఖాస్తులు

రూ.500కే గ్యాస్ సిలిండర్	-	2,83,767
గృహజ్యోతి(200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్)	-	2,67,734
మహిళలకు ప్రతినెలా రూ.2500 ఆర్థిక సహాయం	-	2,50,915
ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం	-	2,36,014
ఎకరాకు రూ.15వేల రైతుభరోసా పథకం	-	1,72,414
ఎకరాకు రూ.15వేలు (కౌలు రైతులు)	-	8,033
వ్యవసాయ కూలీలు (ఏడాదికి రూ.12వేలు)	-	1,44,818
చేయూత పథకం ద్వారా పింఛన్ దరఖాస్తులు	-	81,755
దివ్యాంగుల పింఛన్ దరఖాస్తులు	-	6,735
తెలంగాణ ఉద్యమ అమరులు (250గజాలు)	-	556
తెలంగాణ ఉద్యమకారులు (250గజాల స్థలం)	-	3,775
మొత్తం	-	14,56,516

వ్యవసాయమే ఆధారమంటూ

ప్రజాపాలన దరఖాస్తుల్లో వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నామనే కోణంలో తమ వివరాలను పొందుపరచడం జరిగింది. ప్రస్తుతం రైతుబంధు సహాయం పొందుతున్న వారు ప్రజాపాలన దరఖాస్తుల్లో రైతుభరోసాకు వివరాలు నమోదు చేయవద్దని ప్రభుత్వం సూచించింది. అయినప్పటికీ ప్రతీ ఏటా ఎకరాకు రూ.15వేల రైతుభరోసా కావాలని 1.72లక్షల మంది తమ వివరాలు నమోదు చేశారు. 8వేల మంది కౌలు రైతులు కూడా తమకు ఎకరాకు రూ.15వేల సహాయం అందించాలని కోరారు. ఇక వ్యవసాయాధారిత పనుల్లో తాము కూలీలుగా ఉన్నామని, తమకు ఏటా రూ.12వేల భృతి కల్పించాలని 1.44లక్షల మంది విన్నవించారు. మొత్తంగా వ్యవసాయ రైతులు, కౌలురైతులు, కూలీలుగా 3.20లక్షల విజ్ఞప్తులు ఈ దరఖాస్తుల్లో దర్శనమిచ్చాయి.


దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు (ఫైల్)

మున్సిపాలిటీల బడ్జెట్ వాస్తవికంగా ఉండాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 19: మున్సిపాలిటీల బడ్జెట్‌ను వాస్తవానికి అనుగుణంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని మున్సిపాలిటీల గత సంవత్సర బడ్జెట్‌ను మరోసారి పరిపూర్ణంగా పరిశీలించాలని సూచించారు. తదనంతరం మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లను సంప్రదించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి వాస్తవానికి అనుకూలంగా ఫిబ్రవరి మూడోవారంలో బడ్జెట్లను తయారు చేయాలని పేర్కొన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధితో పాటు పారిశుధ్యం, పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ గ్రీన్‌బడ్జెట్ కూడా తయారు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో ఆస్తి పన్నులను పూర్తిగా వసూలు చేయాలని, విద్యుత్ బిల్లులను చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, మున్సిపల్ కమిషనర్లు, చేర్యాల మున్సిపల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 19: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మెదక్ పార్లమెంట్ పరిధిలోని దుబ్బాక నియోజకవర్గ సెక్టార్, పోలీస్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ముందుగా దుబ్బాక నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను అధికారులందరూ విజయవంతం చేసినందుకు అభినందించారు. అదే ఉత్సాహంతో మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లను సందర్శించి అక్కడ ఎలక్ట్రిసిటీ, ర్యాంపు, కాంపౌండ్ వాల్, గేటు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పోలింగ్‌స్టేషన్‌ల వారీగా రూట్ మ్యాప్ తయారు చేయాలని, ఎలక్షన్ స్ట్రాంగ్ రూం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మాత్రమే లచ్చపేట తెలంగాణ మోడల్ స్కూల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఏ సమస్య ఎదురైనా పైఅధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు. జనవరి వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు డిగ్రీ కళాశాలలో ప్రత్యేక క్యాంప్ పెట్టాలని, అందరూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఏసీపీ చంద్రశేఖర్, పోలీస్ అధికారులు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- సర్పంచుల పదవీకాలం ఏడాది పాటు పెంచాలి
- సిద్దిపేట అర్బన్, రూరల్ సర్పంచుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సిద్దిపేటఅర్బన్, జనవరి 19 : గ్రామపంచాయతీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, సర్పంచుల పదవీకాలం మరో సంవత్సరం పాటు పొడిగించాలని సిద్దిపేట అర్బన్, రూరల్ గ్రామాల సర్పంచులు కోరారు. శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌కు వినతిపత్రం సమర్పించిన తర్వాత వారు మాట్లాడారు. తాము పదవుల్లోకి వచ్చిన తర్వాత ఎనిమిది నెలల పాటు చెక్‌పవర్ రాలేదని, కరోనా సమయంలో రెండు సంవత్సరాల కాలం వృథాగా గడిచిపోయిందని సర్పంచులు పేర్కొన్నారు. ఇన్‌చార్జులకు అప్పట్లో ఎలాగైతే సమయం పొడిగించారో తమకు కూడా ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మరో సంవత్సరం కాలం పాటు పదవీ కాల సమయాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి త్వరత్వరగా బిల్లులు రాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి పెట్టాల్సి వచ్చిందని, ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అర్బన్ గ్రామాల సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, ఎల్లుపల్లి సర్పంచ్ జయశ్రీ రమేష్, తడకపల్లి సర్పంచ్ మంగ భాస్కర్, పొన్నాల సర్పంచ్ రేణుక శ్రీనివాస్, మందపల్లి సర్పంచ్ రాజయ్య, పున్నూరు గ్రామ సర్పంచ్ మరియు ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.


కలెక్టర్ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల సర్పంచులు

గంజాయి రవాణా, పేకాటపై ప్రత్యేక నిఘా

- మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 19: జిల్లాలో గంజాయి రవాణా పేకాటపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని సూచించారు. సిద్దిపేట కమిషనరేట్‌ను అన్ని విభాగాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సమూలంగా నిర్మూలించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పా రు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిలో ధనిక, పేద తేడా లేకుండా అందరి సమస్యలు విని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసు ల్లో ఇన్వెస్టిగేషన్ త్వరగా పూర్తిచేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకింగ్ వచ్చే విధంగా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించే అధికారులు లాడ్జిలు, పాత నేరస్తులను తనిఖీ చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలనిసీపీ తెలిపారు. సైబర్ నేరాలపై మహిళల రక్షణ చట్టాలు, షీటీమ్స్, కళాబృందం కార్యక్రమాల్లో అధికారులు తప్పకుండా పాల్గొనాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏసీపీలు సతీష్, రమేష్, సురేందర్ రెడ్డి, ప్రసన్న కుమార్, చంద్రశేఖర్, రవీందర్ రాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

ప్రభుత్వ భూములు, నీటి వనరులను పరిరక్షించండి

- అక్రమ మైనింగ్, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డిటౌన్/సంగారెడ్డిరూరల్, జనవరి 19: ప్రభుత్వ భూములు, నీటి వనరులు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల ప్రభుత్వ భూములు, నీటివనరులు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని లేఅవుట్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, అక్రమ మైనింగ్‌పై నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన వాహనాలను సీజ్ చేశారో పదిహేను రోజుల్లో నివేదకి అందజేయాలని మైనింగ్ ఏడీకి సూచించారు. జిల్లాలో ఎక్కడా బెల్ట్‌షాప్‌లు ఉండకుండా మూసివేయించాలని ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన వసతులకు సంబంధించి నివేదిక అందజేయాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీల్లో వసతులు, సిబ్బంది, భవనాలు తదితర వివరాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సీఎస్ఆర్ నిధులు సేకరించండి

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు సేకరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించేలా చూడాలని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులు విద్య, వైద్య సదుపాయాల కోసం ఖర్చు చేయాలని, హాస్టళ్లు, ఆసుపత్రులు, అదనపు తరగతి గదులు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో కావాల్సిన సౌకర్యాల కోసం వినియోగించేలా చూడాలని సూచించారు. సమీక్ష సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షకు హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహను జర్నలిస్టులు కలిసి తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గత ప్రభుత్వం స్థానికేతరులైన కొందరికి మాత్రమే ఇంటి స్థలాలు ఇచ్చిందని, అర్హులకు అన్యాయం చేసిందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.


బారికేడ్‌లతో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

- మూడునెలల జాతరకు అంకురార్పణ
- హైదరాబాద్ నుంచి వేల మంది భక్తుల రాక
- మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం

7లో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

16 గదుల వసతి భవనం ప్రారంభం

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలికి శుభాకాంక్షలు తెలిపిన పులిమామిడి రాజు


గోదావరిఅంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పులిమామిడి రాజు

సదాశివపేట, జనవరి 19 : సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలుగా నియమితులైన గోదావరి అంజిరెడ్డిని సంగారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పులిమామిడి రాజు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్‌రావు, రాములు, పవన్, మందుల నాగరాజు, వాసు, ఆదిత్య, ప్రవీణ్, గిరిధర్, సుధాకర్, హరీష్‌కుమార్, రాగం అనిల్‌కుమార్, గుణాకర్, చిన్న, తాల్లెల్మ రాము తదితరులు పాల్గొన్నారు.

గోదావరి అంజిరెడ్డి నియామకం హర్షణీయం

గుమ్మడిదల, జనవరి 19 : సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా గోదావరిఅంజిరెడ్డిని నియమించడం హర్షణీయమని మండల అధ్యక్షుడు చింతల యాదగిరి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, తెలిపారు. గోదావరి అంజిరెడ్డి నేతృత్వంలో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

రెండోసారి గడ్డం శ్రీనివాస్ నియామకం పట్ల హర్షం

పెద్దశంకరంపేట, జనవరి 19: మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి గడ్డం శ్రీనివాస్‌ను నియమించడంపట్ల మండల అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అయోధ్యకు విశిష్ట అతిథిగా డాక్టర్ అరవింద్‌కు ఆహ్వానం

● 22న ప్రాణ ప్రతిష్ఠకు హాజరుకావాలని ట్రస్ట్ నుంచి పత్రిక


డాక్టర్ అరవింద్

సిద్దిపేట టౌన్, జనవరి 19 : ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి విశిష్టఅతిథిగా హాజరుకావాలని సిద్దిపేటకు చెందిన తెలంగాణ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అరవింద్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మేరకు ఈనెల 20న సాయంత్రం, 21న మధ్యరావాలని, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత, ఆహ్వానితులకు శ్రీరాముని విగ్రహ దర్శనానికి అవకాశం ఉంటుందని ఆహ్వాన లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పారు. తెలంగాణ నుంచి అయోధ్యకు చాలా తక్కువ మందికి అవకాశం వచ్చిందని, తనకు విశిష్ట అతిథిగా ఆహ్వానం అందడం పట్ల ఆనందంగా ఉందన్నారు. అయోధ్యలో సిద్దిపేట ప్రజలు ఆనందంగా, సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తానని చెప్పారు. సిద్దిపేట నుంచి ఎంపికైనందుకు ఆనందంగా ఉందని, జాతీయ స్థాయిలో సిద్దిపేట గుర్తింపు తెచ్చుకోవడంతోనే అవకాశం వచ్చినట్లు భావిస్తున్నానని చెప్పారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిలో ఏ కార్యక్రమం నిర్వహించిన సిద్దిపేటకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. దేశంలోనే సిద్దిపేటను అభివృద్ధిలో మంచి పేరు తీసుకువచ్చామన్నారు. అయోధ్య కార్యక్రమంలో సిద్దిపేట పేరు ఇనుమడింపచేసేలా సిద్దిపేట ప్రత్యేకతను చాటాలని సూచించారు.

ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ నాయకులకు

అహంకారం పోలేదు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్

నర్సాపూర్, జనవరి 19: ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ ముఖ్య నాయకులకు అహంకారం పోలేదని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. నర్సాపూర్‌లో శుక్రవారం ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు పెద్దరమేష్‌గౌడ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటై కేసీఆర్‌ను ఓడించాలని కుట్రపన్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయస్థాయిలో బద్ధ శత్రువులని అటువంటి పార్టీలు ఒక్కటవుతాయంటే ప్రజలు నవ్వుకుంటారన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలే ఓడించాలనుకున్నారని, ఆ నాయకుల అహంకారం, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్లనే ఓటమి చెందారని స్పష్టం చేశారు. అయినా ఇంకా హరీశ్‌రావు, కేటీఆర్‌కు అహంకారం పోలేదన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధిచెబుతారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని తెలిపారు. 22వ తేదీన అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నర్సాపూర్‌లో శివాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నందున ప్రజలు పెద్దసంఖ్యలో రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, లతరమేష్‌యాదవ్ నాయకులు కొత్త శ్రీనివాస్, రాంరెడ్డి, బాలరాజు, ఆంజనేయులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో

'జీవశాస్త్రంలో నవీన సరళి'పై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకురాలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 19 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన జీవశాస్త్రంలో నవీన సరళులు అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సును ప్రారంభించారు. మొదటి రోజైన శుక్రవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వెంకటేశం మాట్లాడుతూ పరిశోధన రంగంలోని నూతన ఒరవడులను, పరిజ్ఞానం పెంచుకోవడానికి విద్యార్థులకు, అధ్యాపకులకు జాతీయ సదస్సులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఐఐటీహెచ్, హెచ్‌సీయూ, గీతం ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ఆచార్యులు అతిథులుగా విచ్చేసి జీవశాస్త్రంలో వారు పరిశోధించే అంశాల గురించి వివరిస్తారని జువాలజీ విభాగాధిపతి రమేశ్‌బాబు తెలిపారు. కాగా ఐఐటీహెచ్ జీవసాంకేతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజకుమార్ ఈరప్ప కీనోట్ అడ్రస్‌లో భాగంగా ఇమ్యూనోథెరపీ గురించి వివరించారు. అదేవిధంగా ఐవీఎఫ్‌లో జరిగే అధునాతన ఔషధాల గురించి సూచనలు చేశారు. అనంతరం ఐఐటీహెచ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్ర ఎస్ఏఆర్ఎస్-సీఓవీ2 వైరస్ అంశంపై వివరించారు. కాగా ఈ జాతీయ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తల్లిదండ్రుల పేరిట, వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ సహకారం అందించినందుకు సంస్థ చైర్మన్ అనంతకృష్ణకు కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ సదస్సు సంచాలకులు డా.మిథున్‌కుమార్‌రాథోడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుగుణావతి, నాగరాణి, అన్నపూర్ణ, శ్రావణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో డీసీఎం బోల్తా

● హమాలీ కార్మికుడు మృతి



శివకుమార్ మృతదేహం

హత్నూర, జనవరి 19: అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే డీసీఎం బోల్తా పడి హమాలీ కార్మికుడు మృతిచెందిన సంఘటన హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. హత్నూర మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే డీసీఎం వ్యాన్ డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో వాహనాన్ని నడిపాడు. నాగారం గ్రామ శివారులోని టర్నింగ్ వద్ద డీసీఎం బోల్తా పడింది. డీసీఎంలో బియ్యం దించడానికి వచ్చిన కూలీగా పని చేసే సంగారెడ్డి పట్టణానికి చెందిన నారాయణరెడ్డి కాలనీవాసి ఎర్రోళ్ల శివకుమార్(38) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మధుసూదన్‌రెడ్డితో పాటు మరో కూలీ వసీంకు గాయాలయ్యాయి. వారిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్ మధుసూదన్‌రెడ్డి మద్యం మత్తులో డీసీఎం నడపడం వల్లే ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ, ఇద్దరికి గాయాలు

రామాయంపేట, జనవరి 19 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకెళితే.. రామాయంపేట పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇద్దరు బైక్‌లపై వెళ్తూ బలంగా ఢీకొన్నారు. ఈ మేరకు బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుంటున్న వ్యక్తి అరెస్ట్

● ముంబై ఎయిర్‌పోర్టులో పట్టుకున్న పోలీసులు

హుస్నాబాద్, జనవరి 19 : ఏడేళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుక తిరుగుతున్న కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మహంకాళి అమరేందర్‌ను ముంబై ఎయిర్‌పోర్టులో శుక్రవారం అరెస్ట్ చేసినట్లు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. 2014 సంవత్సరంలో కోహెడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అమరేందర్ కోర్టుకి హాజరు కాకుండా తప్పించుక తిరుగుతున్నాడని, నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ అయ్యిందని పేర్కొన్నారు. అమరేందర్ బహ్రైన్ దేశం నుంచి రాగా ముంబై ఎయిర్‌పోర్టులో కోహెడ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు పురోగతిలో పాలుపంచుకున్న కోహెడ ఎస్ఐ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ లింగారెడ్డి, కానిస్టేబుల్ రాజును ఏసీపీ సతీష్ అభినందించారన్నారు.

'నెట్' అర్హత పరీక్షలో యువకుడి ప్రతిభ

రాయపోల్, జనవరి 19 : ప్రతీ ఏడాది జాతీయస్థాయిలో యూజీసీ - ఎంటీఏ నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్(నెట్)లో దౌల్తాబాద్ మండల యువకుడు చెన్న రాజు అర్హత సాధించాడు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు అభ్యసించిన మండలంలోని శౌరీపూర్ గ్రామానికి చెందిన చెన్న రాజు ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. దేశంలో వివిధ యూనివర్సిటీలకు చెందిన పీజీ స్థాయి విద్యార్థులు పోటీపడే ఈ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా పీహెచ్‌డీ అడ్మిషన్ పొందడంతో పాటు డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అర్హులవుతారు. కాగా మండలానికి చెందిన యువకుడు జాతీయస్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం పట్ల మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మహాజాతర


రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

● మూడునెలల జాతరకు అంకురార్పణ
● హైదరాబాద్ నుంచి వేల మంది భక్తుల రాక
● మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం

చేర్యాల, జనవరి 19 : కొమురవెల్లి మల్లన్న ఆలయం పట్నంవారానికి సిద్ధమైంది. ఏడో తేదీన నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా ఆదివారం నిర్వహించనున్న పట్నంవారంతో మూడునెలల జాతరకు అంకురార్పణ పడనున్నది. ప్రతీ ఆదివారం 12 వారాల పాటు జానపదుల జాతర సాగనుంది. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల దరువుతో విజయాచల గుట్టలు మార్మోగనున్నాయి.

పట్నంవారం ప్రాముఖ్యం

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తుండటం అనాదిగా వస్తోంది. మల్లన్న యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవీని వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈవారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం తెల్లవారుజామునే తలనీలాలు అందించి పుణ్యస్నానమాచరిస్తారు. స్థానికంగా కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం నివేదిస్తారు. పట్నం వేసి సహపంక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. అలాగే స్వామివారి తోబుట్టువు ఎల్లమ్మ దేవతకు బోనాలు చేసి నివేదిస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవపూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. మల్లన్నను ఇతరుల రూపంలో భావించి వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాల్లో చిందేసి తన్మయత్వం చెందుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు.



మల్లన్న ఆలయ రాజగోపురం

క్యూలైన్ కోసం చలువ పందిళ్లు

ఈసారి 12 వారాల జాతర

గతంలో మల్లన్న ఆలయంలో కేవలం మూడు నెలల కాలంలో ఏడు వారాల్లోనే జాతర కొనసాగేది. దీంతో సత్తేటి వారాల జాతర అని పిలిచేవారు. అప్పట్లో భక్తుల రద్దీ అంత ఎక్కువగా లేకపోవడంతో మూడునెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేదని, మిగతా రోజుల్లో మూసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా ఏయేటికాయేడు భక్తుల రాక అధికమవుతుండటంతో జాతర సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ ఆలయం రద్దీగా మారుతోంది. తిథుల ఆధారంగా బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ఒక్కోయేటా వారాల సంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈసారి 12 వారాల పాటు జాతర సాగనుంది.

21-01-2024 మొదటి వారం (పట్నంవారం)
28-01-2024 రెండో వారం (లష్కర్‌వారం)
04-02-2024 మూడోవారం
11-02-2024 నాలుగోవారం
18-02-2024 ఐదోవారం
25-02-2024 ఆరోవారం
03-03-2024 ఏడోవారం
08-03-2024 మహాశివరాత్రి
10-03-2024 ఎనిమిదో వారం
17-03-2024 తొమ్మిదో వారం
24-03-2024 పదోవారం
31-03-2024 పదకొండోవారం
07-04-2024 పన్నెండోవారం
(అగ్నిగుండాలతో సమాప్తం)



కొమురవెల్లిలోని మల్లన్న దేవుడు

మూడు దిక్కులా పార్కింగ్ స్థలం ఏర్పాటు

కొమురవెల్లికి చేరుకునే మూడు మార్గాల్లో మల్లన్న చెరువు సమీప ప్రాంగణం, పెట్రోల్‌పంప్ ఎల్లమ్మ ఆలయం, ఆర్టీసీ బస్టాండు సమీపాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పట్నంవారంతో పాటు జాతర మూడు నెలల కాలంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాం. త్వరితగతిన దర్శనం కలిగించడంతో, ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ ఏర్పాట్లు చేపట్టాం. పారిశుధ్య చర్యలు నిరంతరం నిర్వహించేలా సిబ్బందికి సూచనలు చేశాం. భక్తుల భద్రతకు పోలీసు అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నాం. రాజగోపుర ఆవరణలో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

- బాలాజీశర్మ, ఆలయ ఈవో

మల్లన్నను దర్శించుకున్న సిద్దిపేట సీపీ అనురాధ

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని సిద్దిపేట సీపీ అనురాధ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలకగా, సీపీ అనూరాధ గర్భాలయంలో మల్లన్నకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయార్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. పట్నంవారం ఏర్పాట్లపై ఆలయాధికారులతో పాటు పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

'శివసదనం' వసతి భవనం ప్రారంభం

కొమురవెల్లి మల్లన్న భక్తుల సౌకర్యార్థం అన్నదానసత్ర భవనం ఎదురుగా నిర్మించిన 16 గదుల శివసదన భవనాన్ని శుక్రవారం పునరుద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రూ.1.32 కోట్లతో రెండు అంతస్తుల్లో నిర్మించిన వసతి గదులను ఈనెల 7వ తేదీన జరిగిన మల్లన్న కల్యాణానికి హాజరైన మంత్రి కొండా సురేఖతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని శిలాఫలకం ఏర్పాటు చేశారు. కానీ మంత్రి సురేఖ ప్రొటోకాల్ వాహన కాన్వాయ్ నిర్వహణ తప్పిదంతో నెలకొన్న పరిణామంతో వాయిదా వేశారు. దీంతో జాతరలో అందుబాటులోకి తీసుకువచ్చే పరిస్థితి లేక భక్తులు ఇబ్బందులుపడే పరిస్థితి నెలకొందన్న విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'కొమురవెల్లిలో వసతిగదుల ప్రారంభంపై నిర్లక్ష్యం' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి పునరుద్ధరణ కమిటీ స్పందించింది. శుక్రవారం చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిధులతో గతంలో మల్లన్న ఆలయ పరిధిలోని షాపింగ్‌కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటుతో పాటు హైదరాబాద్ భక్తుడు ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో బాలాజీశర్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.



శివసదన భవనాన్ని ప్రారంభిస్తున్న పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి

గుట్టుగా గుట్టలను తవ్వేస్తున్నారు

● మట్టి కోసం ప్రకృతి అందాలకు తూట్లు ● నర్సాపూర్ చుట్టూ యథేచ్ఛగా తవ్వకాలు

నర్సాపూర్, జనవరి 19: నర్సాపూర్ ప్రాంతంలో గుట్టలు, వాటిపై పరుచుకున్న పచ్చదనం ఎంతగానో ఆకట్టుకుంటుంది. అయితే స్వార్థపరుల చేతిలో నర్సాపూర్ చుట్టూ ఉన్న గుట్టలు ఉనికినే కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. హైదరాబాద్‌కు నర్సాపూర్ సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతం వ్యాపార, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పలుకుతున్నది. మొన్నటి వరకు పొలాలుగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు పెద్దపెద్ద భవనాలతో దర్శనమిస్తున్నాయి. అయితే ఈ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మట్టి కోసం నర్సాపూర్ చుట్టూ ఉన్న గుట్టలను తవ్వుతున్నారు. దీంతో గుట్టలు కరిగిపోతున్నాయి. పెద్దఎత్తున యంత్రాలతో తవ్వకాలు చేస్తుండటంతో ఇప్పటికే చాలా చోట్ల గుట్టల నుంచి మట్టి తీయడంతో చదునుగా మారుతున్నది. ప్రభుత్వ భూమిలో ఉన్న ఈ గుట్టలను మింగేస్తున్నారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా, అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. నర్సాపూర్ సమీపంలో ఉన్న రాయరావు చెరువు చుట్టూ ఎత్తైన గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టల నుంచి పెద్దఎత్తున యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంత యథేచ్ఛగా మట్టిని ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా ప్రభుత్వానికి మాత్రం ఒక్క రూపాయి రాకపోగా ప్రకృతిపరంగా ఏర్పడ్డ గుట్టలు ఉనికినే కోల్పోతున్నాయి. క్షేత్రస్థాయిలో సమాచారం ఇవ్వడానికి గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలు ఉండే వారు కానీ ఇప్పుడు ఆ వ్యవస్థ లేకపోవడంతో అక్రమాలు అధికారుల దృష్టికి సకాలంలో చేరడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమంగా మట్టి తవ్వకాలను నియంత్రించి ప్రకృతి అందాలను కాపాడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



మట్టి కోసం నర్సాపూర్ పక్కన ఉన్న గుట్టను తవ్విన దృశ్యం

నీటిమడుగులో పడి..

వృద్ధురాలి మృతి

మిరుదొడ్డి, జనవరి 19 : దుస్తులను ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిమడుగులో పడి వృద్ధురాలి మృతిచెందిన సంఘటన శుక్రవారం మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలో చోటు చేసుకున్నది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన వెంకవ్వ(67) శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని పొలం వద్ద దుస్తులను ఉతకడానికి వెళ్లింది. వ్యవసాయ బోరుపంపు వద్ద ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు బోరు నీటి మడుగులో బోర్లపడి అక్కడికక్కడే మృతి చెందింది. దుస్తులు ఉతికేందుకు వెళ్లిన వెంకవ్వ తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయంత్రం కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉంది. మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న

గర్భిణికి సాధారణ ప్రసవం చేసిన వైద్యులు

● 27 వీడబ్ల్యూ బాటిల్స్ ఎక్కించి మరి ప్రసవం
● ఆడ శిశువుకు జన్మనిచ్చిన మహిళ
● వైద్య బృందాన్ని అభినందించిన నీలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి

మంగళ్‌హాట్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ గర్భిణికి నిలోఫర్ ఆసుపత్రి వైద్యులు నార్మల్ డెలివరీ చేసి పండంటి బిడ్డకు ప్రాణం పోశారు. 27 బాటిళ్ల ఫాక్టర్స్ వచ్చి మారి తల్లి బిడ్డకు కొత్త జీవితం ప్రసాదించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి మగ్దంపల్లి గ్రామానికి చెందిన సేవంత బాయ్(31)కి 10 వేల మందిలో ఒకరికి ఉండే అరుదైన వ్యాధితో బాధపడుతుంది. రక్త స్రావం సమయంలో రక్తం గడ్డకట్టకపోవడంతో అదే పనికిగా రక్తస్రావం కావడం ఆమెకు ఉన్న వ్యాధి. వీడబ్ల్యూ డీ - 3 రకం లోపంతో బాధపడుతున్నట్లు గతంలోనే నిమ్స్ వైద్యులు గుర్తించారు. ఇదిలా ఉండగా ఆమె గర్భం దాల్చగా ఐదు నెలలు నిండిన తరువాత నుంచి నిలోఫర్ వైద్యులను సంప్రదించి తనకున్న సమస్యను వివరించింది. దీంతో ఆసుపత్రి గైనకాలజీ వైద్యులు సదరు మహిళకు అప్పటి నుంచి పరీక్షలు నిర్వహిస్తూ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఈ నెల 13వ తేదీన ప్రసవం నిమిత్తం వచ్చిన సదరు మహిళకు మరో మారు పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ చేశారు. పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా కాన్పు సమయంలో రక్తం శ్రావం కారణంగా ఆమెకు 27 బాటిళ్ల వీడబ్ల్యూ ఫ్యాటర్‌లను అందించారు. రూ. 1.50 లక్షల విలువైన ఈ ఫ్యాటర్లను ఉచితంగా అందించడంతో ప్రస్తుతం తల్లి బిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో అత్యంత అరుదైన వ్యాధితో బాదపడుతున్న మహిళలకు నార్మల్ డెలివరీ చేసిన డాక్టర్ ఇంద్రమణి, డాక్టర్ సునిత, డాక్టర్ అనిత, డాక్టర్ సాధన, డాక్టర్ దామోదర్, డాక్టర్ భవతిలతో పాటు వైద్య సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్ కోసం కష్టకాలంలో

పనిచేసిన వారిని గుర్తిస్తాం

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మంత్రి పొన్నంతో ములుగు మండల నాయకులు

ములుగు, జనవరి 19 : కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపునిస్తామని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ములుగు మండల మాజీ ఎంపీపీ భర్త సుధాకర్ శుక్రవారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి తీరుతామన్నారు. ప్రతిపక్ష పార్టీలు నెల గడవకముందే హామీలు అమలు చేయాలని గగ్గోలు చేస్తున్నారని, కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పనిచేసినా రైతులకు రుణాలను మాఫీ చేయలేకపోయారన్నారు. అలాంటి వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలకు ప్రభుత్వంలో, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వారితో మాజీ ఎంపీపీ వెంకట్రామారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ బొడ్డు బాలయ్య, ప్రవీణ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, భుజంగారెడ్డి, ముత్యాలుగౌడ్, భద్రయ్య తదితరులున్నారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌కు

సరిపడా నిధులు మంజూరు చేయండి

● వచ్చే వర్షాకాలం నాటికి రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టాలి
● రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చాడ వెంకట్‌రెడ్డి వినతి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జనవరి 19 : నిలిచిపోయిన శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్‌తో పాటు కెనాల్స్ నిర్మాణ పనులకు సరిపడా నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. శ్రీరాంసాగర్ వరదకాలువలో భాగంగా గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి లిఫ్ట్ కెనాల్స్‌కు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2007లో శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం గౌరవెల్లి రిజర్వాయర్ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయని, ముంపు బాధితులకు ఇంకా పరిహారం అందించకపోవడంతో పనులు నిలిచిపోయాయని వెల్లడించారు. అలాగే గండిపల్లి రిజర్వాయర్ పనులు కూడా 50శాతం మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఈ వేసవికాలంలో రిజర్వాయర్లను పూర్తి చేస్తే వర్షాకాలంలో నీటిని నింపే అవకాశం ఉంటుందన్నారు. గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నుంచి కెనాల్స్ నిర్మాణం కొంత మేర జరిగాయని తెలిపారు. రిజర్వాయర్లు, కెనాల్స్ భూ సేకరణకు సరిపడా నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చాడ కోరారు.

ఈ నెల 24 వరకు
జాతీయ బాలికాదినోత్సవ వేడుకలు

● జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 19: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని, భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టిన ఆడపిల్ల పేరు మీదుగా మొక్క నాటడం, గ్రామస్థాయిలో మహిళా గ్రామ సభలు, అలాగే పలు ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలను ప్రోత్సహిస్తూ ఆటల పోటీలు, సైన్స్‌ఫెయిర్, వ్యాసరచన, ఉపన్యాస, చిత్ర లేఖన పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు ఈ నెల 24 న బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బహుమతులు అందించనున్నట్టు ఆయన తెలిపారు.

నవోదయ పరీక్షకు సర్వం సిద్ధం


దుబ్బాకలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి 19: దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో శనివారం నిర్వహించే జవహర్ నవోదయ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు దుబ్బాక ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు. శుక్రవారం దుబ్బాకలో వివేకానంద విద్యాలయంలో, మిరుదొడ్డి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నవోదయ పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. దుబ్బాకలో 192, మిరుదొడ్డి పాఠశాలలో 195 మంది విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు.

వీగిన చేర్యాల మున్సిపల్ 'అవిశ్వాసం'

● ఐదుగురు కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు ● కోరం లేక వీగిందని ఆర్డీవో వెల్లడి



అవిశ్వాస పరీక్ష సమావేశానికి హాజరైన ఏడుగురు కౌన్సిలర్లు, వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీవో

చేర్యాల, జనవరి 19: చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డిలపై అవిశ్వాసం వీగిపోయింది. కొద్దిరోజులక్రితం 9మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం అందించడంతో బలనిరూపణ కోసం శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిద్దిపేట ఆర్డీవో రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఉదయం10-30గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్ణీత సమయానికి కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు కౌన్సిలర్లు ముస్త్యాల తార, చెవిటిలింగం, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మపల్లి లీల, సందుల సురేశ్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ఆడెపు నరేందర్, జుబేదా కాటూన్‌లు హాజరయ్యారు. సమావేశ నిర్వహణకు కోరం ప్రకారం 9మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, ప్రత్యేకాధికారి అరగంట పాటు వేచి చూశారు. అనంతరం మధ్యాహ్నం 1-00గంటల వరకు అవకాశం కల్పించారు. అయినప్పటికీ ఏడుగురు మినహా ఇతరులెవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని అధికారికంగా ప్రకటించారు.

అమ్ముడుపోయారంటూ కౌన్సిలర్ల మండిపాటు

చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి తీరుతో నాలుగేళ్లపాటు ఎలాంటి అభివృద్ధిపనులు చేయలేక తగిన గుర్తింపును పొందడం లేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్ తమను ప్రేరేపించి తీరా డబ్బులకు అమ్ముడుపోయి అవిశ్వాస సమయానికి గైర్హాజరయ్యారని ఏడుగురు కౌన్సిలర్లు మండిపడ్డారు. ముందస్తుగా ఇరువురిని తాము ఏమాత్రం నమ్మకపోయినా రాజకీయాలకతీతంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌లను గద్దె దించుదామని ప్రమాణాలు చేయడంతో పాటు వారం రోజులపాటు వెంట పడటంతోనే తాము అవిశ్వాసానికి సంతకాలు చేశామన్నారు. కానీ చెరి రూ.5లక్షలకు అమ్ముడుపోయి నమ్మకాన్ని వమ్ము చేసి అబాసుపాలు చేశారని ఆరోపించారు. చంటి, సతీశ్‌ల అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, ఇరువురి పరిస్థితిని బట్టబయలుచేసి గుణపాఠం నేర్పుతామన్నారు.

ఫలించిన 'పల్లా' మంత్రాంగం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో చేర్యాల మున్సిపల్ పీఠం హస్తగతమవుతుందని అందరూ ఊహించారు. కానీ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేపట్టిన మంత్రాంగం ఫలించడంతో గులాబీ పట్టును కోల్పోలేదు. నలుగురు బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్లలో ఇరువురిని కూటమి నుంచి చాకచక్యంగా బయటకు లాగేసి అవిశ్వాసం నెగ్గకుండా పార్టీ ఉనికిని చాటుకున్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుతో మర్యాదపూర్వక భేటీ

అవిశ్వాసం వీగిపోయిన అనంతరం రాత్రి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శ్రీధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిశారు. మాజీ మంత్రులను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్, యాట కనకమ్మ, తదితరులు ఉన్నారు.

మెదక్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి
డిప్యూటేషన్‌పై మల్లన్న ఆలయ ఏఈవో


వైరాగ్యం అంజయ్య

చేర్యాల, జనవరి 19: కొమురవెల్లి మల్లన్న ఆలయం ఏఈవో వైరాగ్యం అంజయ్యను దేవాదాయశాఖ మెదక్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి డిప్యూటేషన్ వేస్తూ ఆ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలు, భూముల పరిరక్షణ, ఆక్రమణలపై నివేదిక రికార్డులలో పొందుపరిచే బాధ్యతలను అప్పగించారు. డిప్యూటేషన్ ఉత్తర్వులను ఈవో బాలాజీశర్మ ఆయనకు అందించడంతో వెనువెంటనే రిలీవ్ అయ్యాడు. ఇదిలా ఉండగా జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇటీవల మల్లన్న ఆలయంలో పునరుద్ధరణ కమిటీ సభ్యులతో సమావేశమై ఆలయవర్గాలతో చర్చించారు. ఆలయ అధికారులు, ఉద్యోగులతో పాటు చాన్నాళ్లపాటు తిష్ఠ వేసిన వారి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో కొన్నాళ్లక్రితం మాజీచైర్మన్ గీస భిక్షపతితో విబేధాలు తలెత్తి అంజయ్యపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తాజాగా హైదరాబాదుకు చెందిన ఇరువురు పునరుద్ధరణ కమిటీ సభ్యులు వైరాగ్యం అంజయ్యపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 20వ తేదీ నుంచి మల్లన్న జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో అయా భిన్న పరిణామాల దృష్ట్యా వైరాగ్యం అంజయ్య బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట ట్రాఫిక్ సీఐ

సిద్దిపేట క్రైం, జనవరి 19: వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిద్దిపేట ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనల గురించి సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, కవితతో కలిసి అవగాహన కల్పించారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో లర్నింగ్ లైసెన్ తీసుకుంటున్న 150 మంది డ్రైవర్లకు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనల గురించి తెలియజేశారు. రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రమే జరిమానాలు విధిస్తామన్నారు.

నేడు గజ్వేల్, వర్గల్ మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజ్వేల్, జనవరి 19: ఈ నెల 20, శనివారం గజ్వేల్ పట్టణంలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గజ్వేల్ రూరల్ మండలంతో పాటు వర్గల్ మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈఈ (ఆపరేషన్) భానుప్రకాశ్ తెలిపారు. గజ్వేల్ పట్టణం మినహాయించి, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో, వర్గల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులతో సహకరించాలని కోరారు.

వెల్కటూరులో ముగ్గుల పోటీలు

సిద్దిపేట అర్బన్, జనవరి 19: సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, నవీన్, సరిత, మమత, ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిని కలిసిన గజ్వేల్ నాయకులు


బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గజ్వేల్, జనవరి 19: బీజేపీ సిద్దిపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా నియామకమైన గంగాడి మోహన్‌రెడ్డిని గజ్వేల్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యదర్శి కడిక్యాల రాములు, బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవుల పల్లి మనోహర్‌యాదవ్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని, గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని వారికి సూచించారు. వారితో నాయకుడు నత్తి శివకుమార్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి


మర్పడగలో కారంపొడి యూనిట్‌ను పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

కొండపాక, జనవరి 19: బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ పేర్కొన్నారు. శుక్రవారం కొండపాక మండలం మర్పడగ గ్రామంలో మహిళా గ్రూపు సభ్యులకు అందించిన రుణాలు ఏ విధంగా సద్వినియోగం అవుతున్నాయనే విషయంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతీ సభ్యురాలు ఏదో ఒక ఆదాయ అభివృద్ధి కార్యక్రమానికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలను వాడుకోవాలని తెలిపారు. తీసుకున్న రుణాలు వంద శాతం తిరిగి చెల్లించాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న సెర్ప్ కార్యక్రమంలో భాగంగా లోకోస్ అప్ ఎంట్రీ, బ్యాంకు లింకేజీ రుణాలపై ఏపీఎం, సీసీలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామంలో న్యూ ఎంటర్ ప్రైజెస్, పీఎం ఎఫ్ఎంఈ పథకాల ద్వారా మహిళలు చేపట్టిన వివిధ యూనిట్లను సందర్శించారు. కారంపొడి ప్యాకెట్స్ తయారీ, పసుపు, అల్లం, వెల్లుల్లి తయారీ యూనిట్లను, పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ పీడీ రవీందర్, డీపీఎం విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్ సీటీవో ఆడిటర్, సీసీలు వీవోఏలు, స్థానిక పంచాయతీ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పంపిణీకి మోక్షమెన్నడో?

● పెండింగ్ పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్


మిరుదొడ్డి: కొండాపూర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

మిరుదొడ్డి, జనవరి 19: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించినప్పటికీ, ఇప్పటి వరకు వాటిని పంపిణీ చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. నిర్మాణాలు పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 138 కోట్లు వెచ్చించినా వృథాగానే..

మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని ఖాజీపూర్40, రుద్రారం20, మోతె 60 చెప్యాల చౌరస్తాలో 75, మల్లుపల్లిలో 40, ధర్మారం 20, కొండాపూర్‌లో 10 డబుల్‌బెడ్ రూం ఇండ్లను పూర్తిచేశారు. అలాగే కొండాపూర్ గ్రామంలో 10 డబుల్ బెడ్‌రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో రూ.138 కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉన్నది.

మౌలిక సౌకర్యాలేవీ?

కొన్ని చోట్ల ఇళ్లను నిర్మించినప్పటికీ బాత్‌రూంలు, డోర్లను, మురికికాల్వలు, సీసీ రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. గ్రామాల్లో లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయకపోవడం వల్ల అనర్హులు ఆ ఇళ్లలోకి గుట్టుచప్పుడుకాకుండా వెళ్లి కబ్జా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, సంబంధిత అధికారులు స్పందించి పూర్తయిన ఇళ్లకు మౌళికసౌకర్యాలు కల్పించి అర్హులకు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం పూర్తయిన డబుల్ ఇళ్లలో చొరబడినవారిని వెంటనే ఖాళీ చేయించాలని అధికారులను కోరుతున్నారు. భూంపల్లి గ్రామంలో నిర్మించిన ఇండ్లను మాత్రం గత ప్రభుత్వహయాంలోనే పంపిణీ చేశారు.

'కసూర్బా' నిర్వహణపై పర్యవేక్షణ ఏదీ?

● వాటర్‌ప్లాంట్ చెడిపోయినా పట్టించుకోని అధికారులు ● విద్యార్థులకు చిన్నసైజ్ కోడిగుడ్ల పంపిణీ


పాడైపోయిన వాటర్‌ప్లాంట్

చేర్యాల, జనవరి 19 : చేర్యాల పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో సురక్షిత తాగునీరందించే వాటర్‌ప్లాంట్ చెడిపోయినా పట్టించుకునేవారే కరువయ్యారు. అంతేగాకుండా విద్యార్థులకు పౌష్టికాహారంగా అందించే కోడిగుడ్లు కూడా చిన్నసైజులో ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెడిపోయిన వాటర్ ప్యూరిఫయర్

విద్యార్థులకు సురక్షిత తాగునీటినందించేందుకు పాఠశాలలో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. కొద్దిరోజులక్రితం పాడైపోవడంతో ఆరుబయట నుంచి కొనుగోలు చేస్తున్నప్పటికీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సంక్రాంతి సెలవుల అనంతరం గురువారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. అయితే పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు అరటిపండ్లు అందించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా బోర్డుపై పాతవారి పేర్లనే కొనసాగిస్తున్నారు. కాగా కస్తూర్బా పాఠశాలకు కొన్నాళ్లుగా చిన్నపాటిసైజు కోడిగుడ్లు సరఫరా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బలవర్ధక పోషక విలువలున్న కోడిగుడ్లను విద్యార్థులకు నిత్యం భోజనంలో విధిగా పెట్టాలని ప్రభుత్వ ఉద్దేశం. అయితే నిర్దేశించిన పరిమాణం గల కోడిగుడ్లను సరఫరా చేయకుండా కనీస పరిమాణంలేని చిన్నసైజ్ గుడ్లను అందిస్తున్నారు. అయినా పాఠశాల నిర్వాహకులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇంతియాజ్‌ను వివరణ కోరగా వాటర్‌ప్లాంటు ఇటీవల పనిచేయని విషయమై మెకానిక్‌కు తెలిపామన్నారు. టెండర్ దారుడు పంపించిన గుడ్లను విద్యార్థులకు పెడుతున్నామన్నారు.

కాంగ్రెస్‌ది రైతు సంక్షేమ ప్రభుత్వం


సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట టౌన్, జనవరి 19: కాంగ్రెస్ పార్టీది రైతు సంక్షేమ ప్రభుత్వమని పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రంగనాయక సాగర్‌లోకి నీరు విడుదల చేసినందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖల ఫ్లెక్సీకి కాంగ్రెస్‌పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగిలో రైతులు ఇబ్బంది పడవద్దన్న ఆలోచనతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రంగనాయక సాగర్‌లోకి నీరు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్క సతీష్‌గౌడ్, ముద్దమ్ లక్ష్మి, గ్యాదరి మధు, షాబుద్దీన్, కోలన్ నరేష్, గయాజుద్దీన్, నజ్జు రఘుపతి మహారాజ్, బైరి సాయి, సుధీర్, ఎల్లవ్వ, రజిని, స్వప్న పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పెల్ వీజార్డ్ డ్రామా పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట క్రైం, జనవరి 19 : సిద్దిపేట జిల్లా విద్యా కార్యాలయంలో జిల్లా విద్యాధికారి ఈ శ్రీనివాస్‌రెడ్డి ఇంగ్లిష్ స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇంగ్లిష్ భాషకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఈ భాషను నేర్చుకోవడం వల్ల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పొందడం కోసం పాఠశాల, మండల, జిల్లాస్థాయి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మీడియా కార్యదర్శి ఆస లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు జి.ప్రశాంత్, ఆర్థిక కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

సిద్దిపేట క్రైం, జనవరి 19: వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌ల జయంతి వారోత్సవాల్లో భాగంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నగరస్థాయి క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌ల లాంటి గొప్ప మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని తెలియచేశారు. ఏబీవీపీ విద్యారంగ సమస్యల మీద ఉద్యమాలు చేయడం ఒకటే కాకుండా విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యులు వివేక్, ఏబీవీపీ జిల్లా సంఘటన మంత్రి లక్ష్మీపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్, జిల్లా మహిళా కన్వీనర్ అరుంధతి, మారుతి, వివేక్, పరశురాం, నందు, సంజయ్, వనిత, స్వప్న కార్యకర్తలు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి

ఘనంగా వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకలు


పొన్నాల దత్తాత్రేయ ఆశ్రమ నిర్వాహకుడు సాయిలుకు ధార్మిక పురస్కారం అందజేస్తున్న చెప్పెల హరినాథశర్మ

కొండపాక, జనవరి 19: తూర్పు గోదావరి జిల్లా వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతులు వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకలు కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి విజయదుర్గా ఉపాసకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ మాట్లాడుతూ.. నిరంతరం ఇతరుల మేలును కోరుకోవడమే మానవుడు ఆచరించవలసిన ధర్మమని వెదురుపాక గాడ్ సందేశమని తెలిపారు. ఉదయం శ్రీ విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరసాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 10 గంటల నుంచి రాహుకాలార్చన జరిగింది. ఈ సందర్భంగా 27 నక్షత్రాలు, 12 రాశులకు సంబంధించిన మొక్కలను క్షేత్రం ఆవరణలో నాటారు. విజయదుర్గా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏటా ఉత్తమ ధార్మిక సేవలకు అందించే విజయదుర్గా ధార్మిక సేవా పురస్కారం 2024 సంవత్సరానికి గాను పొన్నాల దత్తాత్రేయ ఆశ్రమం వ్యవస్థాపకుడు నల్ల సాయిలుకు అందజేశారు. సామాన్య జీవనం గడుపుతూ నిష్కళంక భక్తితో దత్తాత్రేయ ఆశ్రమం నడిపిస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్టు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు మల్లికార్జున్, గట్టు విఠల్, మోహన్ దాస్, నరసింహా రెడ్డి, మల్లేశం, తిరుపతి రెడ్డి, మర్యాల వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల హక్కులను కాపాడండి: డీబీఎఫ్


ప్రజాభవన్‌లో వినతిపత్రాన్ని అందజేస్తున్న శంకర్

గజ్వేల్, జనవరి 19: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, ఆధార్ బేస్డ్ వేతనాల చెల్లింపు పద్ధతులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల హక్కులను కాలరాస్తున్నదని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ విమర్శించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఉపాధి హామీ పథకంపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘించిందని ఆరోపించారు. గత యూపీఏ ప్రభుత్వం హయాంలో అమలులోకి వచ్చిన ఉపాధిహామీ చట్టంతో దళితులు, ఆదివాసీలకు, పేదలకు పని లభించి తమ బతుకుతెరువుపై భరోసా కలిగిందని, ఇది జీర్ణించుకోలేని బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఉపాధి పథకం అమలులో తీవ్రమైన నిర్లక్ష్యానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం చేస్తున్న కూలీల వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని, సామాజిక తనిఖీని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. కూలీలకు రూ.5లక్షల ప్రమాదబీమాను అమలు చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీని పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే


ఫారూఖ్‌హుస్సేన్‌ను పరామర్శిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 19: హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్‌ను శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ ఆరోగ్య పరిస్థితిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నంగునూరు, జనవరి 70: టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం నంగునూరులో ఆ సంఘం నాయకులు పొన్నమల్ల హరికృష్ణ, రామస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు అంతరాలు లేని నాణ్యమైన శాస్త్రీయమైన విద్య అందాలంటే కామన్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఆగిపోయిన టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.నరేశ్, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వై.రాజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పి.రాజు, నగేష్, వంశీ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మద్దూరు మోడల్ స్కూల్‌లో నియామకం..
పని చేసేది కలెక్టరేట్‌లో

● ఆరున్నరేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ లేక ఉపాధ్యాయులకు తప్పని ఇక్కట్లు

మద్దూరు, జనవరి 19: మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌కు దాదాపు ఆరున్నరేళ్ల క్రితం కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించినప్పటి నుంచి నేటివరకు డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోనే కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే..

మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఏజెన్సీ ద్వారా అక్టోబర్ 1, 2017లో ఇక్కడ కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించారు. అయితే డీఈవో ఆదేశాల మేరకు నాటి నుంచి నేటి వరకు డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోనే కొనసాగడం పలు విమర్శలకు తావిస్తున్నది. స్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలో జీతాల బిల్లులు, విద్యార్థుల వివరాల నమోదు, ఉపకార వేతనాలకు సంబంధించి ఇతరత్రా ఉత్తర ప్రత్యుత్తరాల పనులను ఉపాధ్యాయులే నిర్వహించుకోవాల్సివస్తున్నది. అనేకమార్లు ఆపరేటర్‌ను నియమించాలని ఇక్కడి ఉపాధ్యాయులు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది.

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం నుంచి జీతాల చెల్లింపునకు మెయిల్ ద్వారా అటెండెన్స్ వస్తుండటంతో ఉపాధ్యాయులు జీతాల చెల్లింపుతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ జీతం చెల్లింపునకు స్టేట్ ఆఫీసుకు పంపిస్తూ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇటీవల ప్రభుత్వం మారినా ఆపరేటర్ లేక పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నది. ఆపరేటర్‌ను నియమించి ఇబ్బందులను తొలగించాలని మరోసారి విన్నవించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుతం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఎలాంటి అటెండెన్స్ మెయిల్ రాకపోవడంతో జీరో జీతం చేసి స్టేట్ ఆఫీసుకు పంపించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అసంపూర్తి గదుల పనులకు రూ.28 లక్షలు మంజూరు

మద్దూరు, జనవరి 19 : మద్దూరు మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల పనులకు సోషల్ వేల్ఫేర్ ద్వారా రూ.28 లక్షలు మంజూరయ్యాయి. 2014లో మోడల్‌స్కూల్ నిర్మాణానికి రూ.3.2 కోట్లు మంజూరు కాగా భవన నిర్మాణ పనులు పూర్తికాక ముందే అడ్మిషన్లు ప్రారంభించడంతో వసతుల నిర్మాణాలు అసంపూర్తిగా మారాయి. అప్పటి నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వసతులు ఉన్నా పై అంతస్తులోని అసంపూర్తి నిర్మాణ పనులను గుత్తేదారు కొనసాగిస్తుండటంతో వసతుల ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సీసీ కెమెరాల పరికరాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరమ్మతులు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.